# రెండు దృశ్యాలు



నెత్తిమీది తట్ట వొయ్యారంగా దింపుకుని, మెల్లిగా తడిక తోసుకుని లోనికి అడుగు పెట్టింది బంగారు. నులక కుక్కిలో ముసుగు తన్ని పడుకున్నాడు రంగడు.

"ఏటి మావోయ్, కోళ్లు ఇంకా గూడు సేర పొద్దున్నా కాలే అప్పుడే తొంగున్నా వేటి? లెగు, లెగు" అని ముసుగులాగేసి జబ్బ పట్టుకు లేవదీసింది.

"పో, పోయే ఇంత పొద్దాయేదాకా నువ్వు పెత్తనాలు సేత్తావుంటే, నేను కుక్క నాగా వాకిలి కాయాలిటే. బంగారూ! నువ్వు పనిసేసి ఇంటికాడే వుండనేకపోయి వావూ!" సెయ్యొదిలించుకుని అటు తిరిగి పడుకున్నాడు.

"అబ్బోస్, ఎంతకోపం వచ్చినాది. మరి పండగపవంటే కూట కేటి! తప్పాలన్నీ తోమి తోమి సేతులు మంటలెత్తినాయను కో, పనయేసరికి ఈయాలయింది. ఏటి సెయ్యమన్నావు" జాలిగా అన్నది బంగారు.

అంతలోనే రంగడికోపం కాస్తా ఎగిరి పోయింది. గబుక్కున లేచి కూర్చుని, "అవునే బంగారూ ఈ పాడుపని సెయ్యొద్దె అంటే ఇన్నావుకావు. ఇప్పుడు కష్టమంటే నే నేటి సెయ్యను. నేను సంపాదించి తెచ్చే మరిద్దరికీ సాలదంటే అంటే ఇనవు. నెల ముప్పయిరోజులు పనిసేత్తె ముప్పై మూడు రూపాయలు ఇత్తారు. ఎవరి పాసిపని రేపటాల నుంచీ మానెయ్యె."

"ఏటిమావా కబుర్లు సెప్పినావు. నువ్వు కష్టపడి తెత్తావుంటే నేను కులుకుతూ కూర్చుని తినమంటావా! పనిసేత్తే తప్పేటి మావా! ఇప్పుడు సుఖంమరిగితే రేపు పిల్లా పిచిక కలిగినాక పని సెయ్యాలంటే వొల్లు వొంగుతుందా. నువ్వన్నీ పిచ్చికబుర్లు సెప్పుతావు గానీ. నువ్వు సంతోసంగుండి నామీద కన్నెర్రజెయ్యకుండా వుంటే నాకు ఏనుగంతబలం మావా ఎంతపనైనా ఇట్టే సేసెత్తాను."

"నీ బాబు నీకు ఏరికోరి పేరెట్టినాడు నిజంగా నువ్వు బంగారానియే నే. నువ్వు రాకముందు గంజినీళ్ళకికూడా కరువైపోయేవోణ్ణి, నువ్వడిగట్టిన కాణ్ణించి నాగా లేకుండా కూడుబ్బలు దొరుకుతున్నయ్యి అదంతా నీ అదుష్టమే నే బంగారూ! నీమీద కన్నెర్రసేత్తానంటే ఛాచా."

"అమ్మగోరు కొత్తసీర ఇచ్చినారుమావా చూడు ఎంతపెద్దపువ్వులో కళ్లుజిగేలుమంటున్నయ్యి ఈ సీర నాకు బాగుండదా మావా."

"నీకళ్టే బంగరూ పాతకోక సుట్టుకున్నా ముద్దబంతి పువ్వు నాగుంటావు" రెండు చేతులూ పుచ్చుకుని దగిరికి తీసుకోబోయాడు.

"ఛీ, ఛీ ఏటిది! ఏళాపాళా లేని పరాసికాలు ఇంక బువ్వతానొద్దేటి చీటికలో వుడుకునీళ్ళెట్టుతాను తానంచేద్దువుగానీ," అంటూ రంగడి చేతుల్ని విడిపించుకుని పెరట్లోకి పారిపోయింది బంగారు.

గిన్నెలో అన్నం పెట్టిదగ్గిర కూర్చుని కొసిరి కొసిరి పెడ్తూ, "అమ్మగోరు మామంచివోరు లేమావారు ఎన్నిపిండొంటలు పెట్టినారో నాడూ ఎంతపనిసేసినా కష్టపుంచుకోని చల్లనిచెయ్యి తల్లి వెయ్యికాలాలు వర్దిల్లాలా! ఇదిగో ఈ గార్లుకూడా పెట్టినారు. ఇంకొకటి తినుమావా" బతిమాలి కడుపునిండా తినిపించింది. ఆ గిన్నెలోనే తనూ పెట్టుకుని గబగబాతిని, ఇల్లంతా చిమ్మయినా పదివేసి, నులక మంచంమీద వుతికినబట్ట పరిచి, బుడ్డిదీపం తగ్గించి పక్కజేరింది. "మావా నే నోమాట అంటాను కోపంసేయవుగందా!" అన్నది బంగారు "నీమీద కోపమేటే బంగారూ సెప్పు సెప్పు" అన్నాడు.

"మావా మన మనువయ్యాక ఇది వాలుగో సంకురేతి గదా ఒక్కపాలన్నా మా అయ్య తీసుకెళ్ళి ఇంత గుడ్డముక్క ఇచ్చిన పాపాన పోనేదుగందా! నన్ను సేసుకుని నీకేటిసుఖం మావా నీజతగాళ్ళంతా పెళ్ళాలతో కులుకుతా అత్తోరింటకెళ్ళితేకా అచుటం నేదు మా అయ్యోటి గతిమాలినోడయిపోయిండు." కళ్ళనీళ్లు పెట్టుకున్నది బంగారు.

"ఛీపాయే ఏటిది పండగపూటా ఏడుస్తారు తెలే వూరుకో యేమీ మా అయ్య పెట్టేదేటే మన రెక్కలు సల్లగుండాల కష్టపడి సంపాదించుకుని తినాల. ఏటికో నాడు మా అయ్య ఇంత బువ్వెట్టి ఓ గుడ్డపాత ఇస్తే

మన బతుకులు వెళ్ళమాగుతయ్యేటే పిచ్చి దానా వూరుకో వూరుకో. నాకు లేని దిగులు నీ కెందుకే. బజ్జిరంవాటి పిల్లనిచ్చినాడు పాలదటే" రంగడు వోదార్చేడు.

"అది కాదు మావా ఒక్క పాలవ్వా అందరం ఒకసోటజేరి పండగ సేసుకుంటే ఎంత సంతోసం ఉంటాది చెప్పు. తోడ బుట్టోడన్నా తీసికెళ్ళి ఇంత పసుపుకుంకుమ బెట్టకపోతే నాకు మనేదిగుంచకేటి"

"పోనియ్యే, నీకంత మనసుగుంటే కష్టపడి ఎట్టాగో నాలుగు డబ్బులు కూడబెట్టి వచ్చే సంకురాతిరికి మీ అయ్యని అమ్మని ఇక్కడికే పిల్సుకొచ్చి పండగ సేసుకుందాము లేయే, ఇంతమాత్రానికే ఇదయిపోతావుటే. నీకు కళ్ళంట నీళ్ళొస్తే నామనసంతా ఎటాగో వుంటాది. నా బంగారానివి కావు, వూరుకోయే." బుజ్జగించి దగ్గిరగా తీసుకున్నాడు. నా మావ ఎంత మంచోడు నా అదుష్టం కొద్దీదొరికాడు. సుక్కల్లో సెందురు వాటివోడు నా మావ అని అమాయకమైన పరవశంతో కండలు తిరిగిన అతని బలమైన చేతుల్లో గువ్వపిట్టలాగా వొరిగిపోయింది బంగారు. ఏ రోజు కూలీ ఆరోజు సంపాదించుకుంటూ పొట్టనింపుకుని వున్నంతలోనే తృప్తిపడి హాయిగా జీవితాన్ని గడిపే ఆ అమాయక హృదయాల్లో ఎంత పండు వెన్నెల. పాలలాటి స్వచ్ఛమయిన మనస్సులు వారివి. అయితే బాహ్యానికి అటువంటివారు అజ్ఞానులూ, అనాగరీకులూనూ.

* * *

అనునాతనంగా పెంచబడిన పూదోటలో రమణీయమైన మూడంతస్థుల మేడ. ఆ మేడలో రెండో అంతస్థులో విశాలమైన గది. విలువైన ఫర్నిచర్ తోనూ, కిటికీలకీ గుమ్మాలకీ సిల్కు తెరలతోనూ శోభాయమానంగా అలంకరించబడివున్నది గది. పూలకుండీలో అప్పుడే తెచ్చి అమర్చిన గులాబీలూ, సంపెంగలూ గదంతా పరిమళాన్ని వెదజల్లుతున్నయ్యి. పెద్దపందిరిమంచంమీద పాలమీగడలాటి పక్క పరిచి అక్కడక్కడా జాజిపూలు చల్లబడివున్నయ్యి. పాలరాతి గచ్చునేలమీద విలువైన తివాసీ అడుగు పెడితే నలిగిపోతుందా అన్నంత మృదువుగా వున్నది. గోడలమీద రాధా మాధవ లాస్యం శివపార్వతుల నృత్యభంగిమ చిత్రాలు ఒకపక్కన, ఉషోదయం, సంధ్యారాగం మొదలయిన ప్రకృతి చిత్రాలు ఒక వైపు వ్రేలాడతీసివున్నాయి. ఇంత చక్కగా అలంకరించిన గదిలో నలుమూలలా సిగిరెట్టు పీకలు పడివుండటం కొంత జుగుప్సాకరంగా వుండకమానదు. కానీ సిగరెట్టు కాల్చటం, అవి నలుమూలలా విరజిమ్ముకోటం నాగరికతా లక్షణం అనుకునేవారికిమాత్రం అది కూడా అందంగానే కనపడొచ్చు. రేడియో మెల్లిగా సరళసంగీతాన్ని ఆలపిస్తోంది. ఇంత చక్కని వాతావరణం శేఖర్ ని ఏమీ ఆహ్లాదపరుమటలేదు. పైపెచ్చు మహా విసుగ్గా పచారుచేస్తూ మాటిమాటికీ గుమ్మంవంక చూస్తున్నాడు. గడియారం బరువుగా తొమ్మిదిసార్లు మ్రోగింది. చేతిలో సిగిరెట్టు విసురుగా మూలకి గిరవాటుచేసి సోఫాలో కూలబడి గట్టిగా నిట్టూర్చాడు. కాలం అతిమందంగా కదులుతున్నట్లు చికాకు పడసాగాడు. ఒకింతసేపటికి మెల్లిగా పట్టుపరదా ఒత్తిగించుకుని, పాలగ్లాసు, తాంబూలపళ్ళెం చేతపట్టుకు అడుగులో అడుగు వేసుకుంటూవచ్చింది శారద. శారద నిజంగా అపరశారదాదేవే. చదువుల సరస్వతి, అందాలరాణి ప్రత్యేకించి ఆ రోజు చేసుకున్న పండగ అలంకరణ మరింత ముగ్ధమోహనంగా వున్నది. విశ్వకర్మ ప్రత్యేకమైన శ్రద్ధతో అందాలన్నిటిని ఒకచోట పోగుపోసి మలిచిన పాలరాతి విగ్రహంలాగా కన్పట్టుతుంది ఆమె లావణ్యం. అయితేనేం ఆమె అందాన్ని చూసి ఆనందించే పరిస్థితిలో లేడు శేఖర్. అర్థంలేని ముంకుపట్టుదలతో అతన్ని మనస్సు శిలారూపం వహించింది. ఆమెని చూసినట్లు మొఖం అటు తిప్పుకున్నాడు. శారద మెల్లిగా అతని దగ్గిరగా కుర్చీలాక్కుని కూర్చుని పండి, పళ్ళెం

**ఎస్. ఎస్. ప్రసూన**

లోని తమలపాకులు సున్నంరాసి చిలకలు చుట్టి అతనినోటికి అందించింది.

"వూ...ఇప్పటికి తీరుబాటు అయిందన్నమాట రాణీగారికి" విసురుగా ఆమె చేతిని తోసేసేడు.

"తొమ్మిదేగదండీ! ఏదో వదినావాళ్ళ కబుర్లు చెప్పుతుంటే అలస్యమయింది." నసిగింది శారద.

"అదే నే చెప్పేదిన్నీ. పుట్టింటికి వస్తే ఆడవాళ్ళకి వొళ్ళూపైతెలీదు. ఈ వెధవొక్కడు ఈ గదిలో పడి ఏడుస్తున్నాడు అనైనా జ్ఞానంలేదు."

"పోనీండి ఇకనుంచి అలస్యం చెయ్యను. ఏదో పొరపాటైంది. ఈ ఆకులు వేసుకోండి"

"నాకేం అక్కర్లేదు. ఆకులకోసం కాచుకూచోలేదు"

శారద మాట్లాడలేదు. కాస్సేపటికి తలెత్తి అక్కడే బల్లమీద మడత విప్పకుండా వున్న ట్వీడుసూటుచూసి

"ఏమండీ మా నాన్న మనసుపడి ఇది మీకు ఎంతో బాగుంటుందని తెచ్చేరు. ఒక్కసారి వేసుకుంటే సంతోషించేవారు. పోని ఇప్పుడైనా వేసుకోండి"

"మహాచెప్పొచ్చావులే నేను కట్టుకోవాలనీ ఆయన సంతోషించాలనీ అనుకుంటే నన్నింత అవమానంపాలు చేసేవారేగాదు"

"అవమానం ఏమిటండీ అందరూ మిమ్మల్ని నెత్తిమీద పెట్టుకుని గౌరవిస్తూంటే"

"అవునవును ఇదంతా గౌరవించటమే మరి ఏమీ తెలియని వెధవనంగనాచి కబుర్లు నువ్వూను."

"ఏమిటండీ అసలు. ఎందుకింత కోపం మీ మనస్సులో వున్నదేమో చెప్పరాదూ"

"ఇంకా చెప్పేదేమిటే మొద్దూ. మూడేళ్ళగా వాయిదా వేస్తున్నారా? పోనీ ఇప్పుడయినా మీ మాట నిలబెట్టుకుంటారేమో అనుకున్నాను. ఛీ, ఛీ. మాటనిలకడ లేని అమర్యాదస్థులనుకోలేదు."

ఏమిటండీ మీ రనేదేమిటో అర్థంకావటంలేదు. మనస్సులో ఉన్నదేమిటో చెప్పండి.

"ఏమిటింకా చెప్పేది. నీకు తెలియదా ఏంకి పదిసార్లు నా చేత వాగించాలనీ గానీ, మన పెళ్ళినాడు మీ నాన్న చేసిన వాగ్దానం నువ్వు మర్చిపోయినా నేను మర్చిపోలేదులే. వెధవ్వేషాలు వెయ్యక ఇప్పుడయినా ఇస్తానన్నది ఇవ్వమను."

"ఓ అదా! ఇంకా ఏమిటో అనుకున్నాను. చేతిలో డబ్బుఆడీ చూచుకుని ఇస్తారు. మోటారు సైకిలంటే మాటలతో వస్తుందా ఏమన్నానా! కాస్త మీరూ పరిస్థితులు అర్థంచేసుకోవాలి మరి."

"ఆఁ. ఇస్తాడు ఇవ్వడూమరి, అప్పుడైతే 'ఇస్తానులేవోయ్' అని ఒక్కమాటంటే తీరిపోతుం దనుకున్నాడు. ఇప్పుడేమో డబ్బు ఖర్చుపెట్టొచ్చేసరికి పీకపట్టుకుంటోంది."

"అన్నీ తెలిసినవారు మీరే ఇట్లా అంటే ఏమి చెప్పేది. మా నాన్నసంగతి మీకు తెలీదుగానీ, ప్రాణం పోయినాసరే అన్నమాట నిలబెట్టుకునే మనిషి."

"తెలుస్తూనే వుంది మీ నాన్న నిజాయితీ. మూడేళ్ళనుంచీ వాయిదా వేస్తున్నారు. పోనీ ఇప్పుడైనా ఇస్తారేమో అనుకుంటే ఓ సూటు మోహానపారేసి పొమ్మంటున్నాడు. అంత గతిలేనివాళ్ళు పండక్కి రమ్మని ఎందుకు పిలవాలి. ఏమయినా ఈసారి మోటారు సైకిలు ఇవ్వాల్సిందే."

"మీరట్లా అంటే ఏం చెప్పను. అసలే వ్యాపారంలో దెబ్బతిని సగంప్రాణంతో వున్నారు. దానికితోడు ఈ ఏడు చెల్లాయి పెళ్ళొకటి చెయ్యాలనుకుంటున్నారు. దానికే డబ్బు సమకూడక సతమతమయిపోతున్నారు. ఇదే అదనని అనుకొని మీరున్నా ఇల్లా వత్తిడి చేస్తే ఎల్లా చెప్పండి కాస్త దయతలచి ఇప్పటికి వూరుకోండి" ప్రాధేయపడింది శారద.

"అదే నేనున్నా అనేది. ఇప్పుడే ఇల్లా వున్నదా! ఇహ కొత్తల్లుడుగాయనస్తే నా

# రెండు దృశ్యాలు

మొహం చూసేవాళ్ళు కూడా వుండరు. అందులోనూ నేను పట్టి బి. ఏ గాణ్ణయ్యె. ఆ వచ్చే దొరగారేమో పి. హెచ్. డి గాండ్యె. ఇంకేం ఆయనగారొక సీమదొర నేను ఆయనదగ్గరపత్తి ప్యూనుగాణ్ణి అన్నట్టు చూస్తారు. మీ సంగతిఇప్పుడే తెలుస్తోంది."

"మీరంత ఇదిగా మాట్లాడితే నేనేమి చెయ్యను ఇటు మీకొ చెప్పలేను అటు వాళ్ళకీ చెప్పలేను. మధ్య నా కొచ్చింది తిప్పలు మూడేళ్ళుగా ఒకటే రభస" కళ్ళ నీళ్ళు పెట్టుకున్నది శారద.

"ఎందుకు నాదగ్గిర ఏడుస్తావు అదేమిటో మీనాన్న దగ్గిరే వద్ద చెప్పకో."

"ఏమండీ ఈసారికి ఊరుకోండి నాన్న పరిస్థితిచూస్తే అడగటానికి నోరు రావటం లేదు. ఈ మాత్రం దయతలచండి."


"దయమాపబట్టే ఇన్నాళ్ళుగా ఆగింది. మీ నాన్నని చూస్తే అడగలేవు. ఆ బంగ మొహం బుర్రమీసాలు చూసేసరికి బెదిరి పారిపోతావ్. ఈ బక్క వెధవ దగ్గిరే నీ ఆట లన్నీ సాగుతున్నయ్యి అనుకుంటున్నవేమో. మర్యాదగా ఇస్తారా ఇవ్వమను లేదా పర్యవసానం బాగా రుచిమాద్దురుగాని" మొండిగా అన్నాడు.

"మీరేమన్నా చెయ్యండి నేను మా నాన్నను అడగలేను కావాలంటే మీరే అడగండి"

"హూ...అడగవుగా! ఇదిగో శారదా చెప్తున్నాను విను. మీనాన్నే మాటనిలబెట్టుకు నేవాడనుకుంటున్నావేమో. నేనే అంతి పాతిగాన్ని వాణ్ణిగాను. మర్యాదగా వూరు కున్నవాళ్ళు లొంగిరారు. ఒక్కటేమాట చెప్తున్నాను ఆలోచించుకో. రేపు నువ్వు నాతో రాదల్చుకుంటావా మోటారు సైకలయినా లేక దానికి సరిపోయే డబ్బైనా తీసుకురావాలి. లేదా అది వచ్చేంతవరకూ నీకుకూడా మాగుమ్మంలో కొక్క అ[illegible]తి లేదు. ఇంక పోఇక్కణ్ణుంచి"

"అదేమిటండీ వాళ్ళేదా ఇస్తానన్నది ఇవ్వకపోతే వాళ్ళమీద కోపం చూపించాలి గానీ నా మీదేమిటండీ నేనేమైనా మీకు లోపం చేస్తున్నానా నన్ను నలుగుర్లో నగు బాట్లపాలు చెయ్యకండీ"

"నీ వెధవ బిడి బుకీదీస్తాలు నా దగ్గిర పనికిరావు. నీ కన్నీళ్ళు చూసి కరిగిపోతా ననుకున్నావేమో అసలు ఏడ్చేవాళ్ళని చూస్తే వొళ్ళుమంట. నా దగ్గిరైతే ఏడవ గలవ్ మళ్ళీ మీ నాన్నని అడగలేవు. పదా పోకళ్ళు పెంచి ఎవడికో అంటగట్టి చేతులు దులిపేసుకునే నాన్న మీద ఎక్కడలేనిజాలీ ను,జన్మంతా బరువుభారాన్ని మోసేవాడిమీద చిన్న సుంత గౌరవమున్నా లేకపోవటమూను-


## క్రొత్త డిజైను సీసా

తాతావారి జనప్రియమైన తల నూనెలు మరియు షాంపూ యిప్పుడు పట్టుకొనుటకు వీలైన అందమైన క్రొత్త సీసాలలో దొరకుతున్నాయి!

కేశములను నిగనిగలాడుతూ మెత్తగా ఉండేలా ఉంచుతాయి.

ది టాటా ఆయిల్ మిల్స్ కంపెనీ లిమిటెడ్ TH. 7343

ఛీ ఛీ మీ ఆడవాళ్ళే అంత కట్టి కృతఘ్నులు - ఫో ఇక్కణ్ణుంచి చెప్పేది నీకు కాదూ"

"అలా కోప్పడకండీ ఈ సారికి మన్నించండీ"

"మన్నించబట్టే నెత్తిన పెట్టుకున్నారు. చెడును చెడుతోనే ఎదుర్కోవాలి మీలాంటి వాళ్ళకి అదేమందు. ఇంక నీ దారి నీది నాదారి నాదిని"


"ఏమైనా నేను ఇక్కణ్ణుంచి కదలను"

"కదలవుగా!" చంపకళ్ళున్నది చిదిమితే పాలుగారే చెక్కిళ్ళేమో ఒక్క దెబ్బకి బుసబుస పొంగిపోయింది అయినా కిక్కురు మనకుండా అతడి పాదాలు గట్టిగా పట్టుకుని...


"మీరేమైనా చెయ్యండి ఏరోజు మీచేతిలో పెట్టారో అప్పుడే మీ సొత్తైపోయాను. ఇప్పుడు మీరు కాదంటే పోతుందా. నేను మీ పాదాలు విడిచి ఎక్కడికీ వెళ్లను"

శేఖర్ కి వెర్రికోపం వచ్చింది ఆమె జడ పట్టుకుని జరజరా లాక్కువచ్చి గది అవతలకి తోసేసి తలుపేసుకున్నాడు.

శారద తండ్రి కలవ వ్యాపారస్థుడు. వ్యాపారంలో బాగా గడించి మంచి స్థితిలో వున్నవాడు. శారద పెండ్లిలో అల్లుడు శేఖర్ మోటారుసైకిలు కావాలని అడిగేడు. అప్పట్లో ఆయనకి అదో లెక్కలోది కాకపోయింది. "అంతే కావలెనోయ్ రేపు పట్నం వెళ్ళి మంచిది చూసి కొందాములే" అన్నారు. కానీ అనుకోకుండా పరిస్థితులు తారుమారై పోయింది. వ్యాపారంలో పెద్దగా నష్టపోయి నిలువునా మునిగిపోయాడు. కొంత కూడదీసుకుని అదను చిక్కాక అల్లుని కోర్కెను తీర్చాలనుకున్నాడు. కానీ ఎంత ప్రయత్నించినా వీలు కాకనే పోయింది. వాయిదాల మీద వాయిదాలు వేస్తూ మూడేళ్ళు జరిగిపోయినయ్యి. కాని అల్లుడికోర్కె తీర్చలేక పోయానే అని ఆయన అనుక్షణం బాధపడుతూనే వున్నాడు. కానీ శేఖర్ మామగారి పరిస్థితిని ఎంతమాత్రం అర్థం చేసుకోలేదు. తన కోరికలు తీరటమే ప్రధానంగానీ, అందుకోసం ఇతర్లు ఎంత కష్టపడ్డా ఏమైపోయినా తనకి కాదనుకునే వాళ్ళల్లో శేఖర్ ప్రథముడు. అందుకనే ఈసారి ఇంత మొండి పట్టుదలలోకి దిగేడు. శారద మాత్రం ఏమి చేస్తుంది? కన్న తండ్రినీ అడగలేదు—చేసుకున్న మొగుడికి నచ్చచెప్పలేక మధ్య నలిగిపోతోంది. గది అవతల శారద భర్తని ఎన్నివిధాలుగానో బతిమలాడుకుని ఏడ్చింది. కానీ ఆ కఠినుడి మనస్సు కరగలేదు. తలుపు తియ్యలేదు. ఇక తల్లిదగ్గరికి వెళ్ళి అమ్మా అంటూ తల్లి ఒడిలో వాలిపోయింది. ఆ తల్లి మాత్రం ఏమి చెయ్యగలదు? కూతుర్ని దగ్గరిగా పొదువుకుని "ఆడవాళ్ళ తల్లీ. అవమానాల్నీ అవమానాల్నీ అన్నిట్నీ ఓరిమిగా స్వీకరించాలమ్మా. అల్లా అయితేనే స్త్రీ క్షమాస్వరూపిణి అన్న పేరు సార్థకమయేది. ఊరుకోమ్మా. నాన్నగారితో చెప్పడామంటే తలవాచ కొట్టుకుంటే ఎక్కడనాన్న తెస్తారు? మీకోసమే కాదుటమ్మా మా బ్రతుకులు. మీరు సుఖంగావుంటే చాలు- మేము ఏమైపోయినా ఫరవాలేదు." అని ఓదార్చింది అమ్మ. ఆ రాత్రిల్లా అమ్మ ప్రక్కలోనే గడిపింది శారద. గదిలో అగరు ధూపాలు కొడికట్టి ఆరిపోయినయ్యి. మండిగాసులో పాలు ఏ రాత్రివేళో విరిగిపోయింది. శేఖర్ కి భార్యమీద కాస్త కూడా జాలి కలగలేదు. అల్లాగే కాలాన్ని మరింతగా దగిరికి తీసుకుని పడుకున్నాడు. రమణీయమైన ధనవంతుల్లో పట్టు పరుపుల మీద శయనించే వారి మనస్సుల్లో ఎంత కటిక చీకటి. వారి హృదయాల్లోనే కాకుంటే వారి చుట్టూవున్న పరిసరాన్ని కూడా కలుషితం చేస్తారు వీరు. అయినా సరే వీరు వారి బాహ్యాడంబరాన్ని బట్టి ఘరానావ్యక్తులుగా గౌరవాన్ని పొందుతారు. ఇదే నాగరికతలోని రహస్యం కాబోలు. ★



బొంబాయి, క్రాస్ మైదాన్‌లో ఏర్పాటుఅయిన రేడియో,అండ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్‌కు కేంద్రమంత్రి డా॥ కేస్కర్ మొన్న ప్రారంభోత్సవం జరిపారు. ఆ ప్రదర్శనంలో డా॥ కేస్కర్, జనరల్ రేడియో అండ్ అప్లయెన్సెస్ (ప్రైవేట్ లిమిటెడ్) వారి విభాగాన్ని సందర్శిస్తున్నప్పుడు తీసిన చిత్రం. డా॥ కేస్కర్ ప్రక్కనున్నవారు నేషనల్ ఎక్కో రేడియో కంపెనీ డైరెక్టరు శ్రీ హెచ్. వి. మేజర్, వెనుకనున్నవారు జనరల్ రేడియో కంపెనీ డైరెక్టరు శ్రీ వై. ఎ. ఫజల్‌భాయ్.

అనేక సంవత్సరముల అనుభవముతో నవీన పద్ధతులలో మాచే తయారుచేయబడిన యినుప బీరువాలు, ఉక్కు బీరువాలు, క్యాష్ బాక్సులు, మరియు ఆఫీసు సామానులు సరసమైన ధరలకు సకాలములో తయారుచేసి యివ్వగలము.

ఆంధ్రదేశీయులు ఈ పరిశ్రమను ప్రోత్సహించండి.

ఆంధ్రసేఫ్ కంపెని,

షో రూము: సరస్వతిటాకీస్ రోడ్, విజయవాడ-1.

వర్కు షాపు: మునిసిపల్ ఆఫీసురోడ్, విజయవాడ-1.

బ్రాంచి: ప్రకాశంరోడ్ - విజయవాడ-2.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యపట్టణములలో సేల్సు ఏజంట్లు కావలెను. వివరములకు వ్రాయండి.